క్లుప్తంగా

విద్యుత్ స్తంభం విరిగిపడి ఒకరికి గాయాలు



నెహ్రూనగర్: సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులు చేపడుతున్న సమయంలో విద్యుత్ స్తంభం విరిగిపడి ఓ వ్యక్తి గాయపడడంతో పాటు మూడు ద్విచక్రవాహనాలు దెబ్బతిన్నాయి. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 54వ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్ 4వ లైనులో సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనుల కోసం కాంట్రాక్టర్లు పొక్లెయిన్‌తో గోతులు తీస్తున్న క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి తగిలి కింద పడిపోయింది. దీంతో అక్కడే ఉన్న ఓ వ్యక్తి తలకు గాయం కాగా జీఎంసీ సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. దీంతో పాటు మూడు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. స్తంభం పడిపోగానే వైర్లు రాసుకుని విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రాణపాయం తప్పింది.

ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థుల ప్రతిభ

నెహ్రూ నగర్: పదో తరగతి పరీక్షల్లో సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. జిల్లాలోని 14 హాస్టల్స్ నుంచి 97 మంది పరీక్షలకు హాజరు కాగా 85 మంది ఉత్తీర్ణత సాధించారని ఆ శాఖ డెప్యూటీ డైరెక్టర్ రాజా దెబోర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫస్ట్ క్లాస్‌లో 58 మంది, సెకండ్ క్లాస్‌లో 19 మంది, తృతీయ శ్రేణిలో 8 మంది ఉత్తీర్ణులయ్యారు. అత్యధికంగా మంగళగిరి హాస్టల్ నుంచి రిత్విక లక్ష్మికి 539 మార్కులు, పెదనందిపాడు హాస్టల్ నుంచి ముట్లూరి యశ్వంత్ 528 మార్కులు, రాజా గారి తోట హాస్టల్ నుంచి శీలం రక్షిత 525 మార్కులు, బృందావన్ గార్డెన్స్ హాస్టల్ నుంచి బి.ప్రసాద్ 515 మార్కులు, దుగ్గిరాల హాస్టల్ నుంచి కే కావ్య 506 మార్కులు, పొన్నూరు హాస్టల్ నుంచి సుమ శ్రీ 502 మార్కులు సాధించారని వివరించారు.

రేపు ఎస్‌హెచ్‌ఓలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్, జాతీయ అధ్యక్షురాలు, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.విజయ ఇచ్చిన పిలుపుమేరకు ఏప్రిల్ 25, 26 తేదీల్లో ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో 'ఉచిత బీపీ పరీక్ష శిబిరం' నిర్వహిస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ టి.సేవ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెక్ బీపీ–స్టాప్ స్ట్రోక్ నినాదంపై ప్రజల్లో చైతన్యమే లక్ష్యంగా సైలెంట్ కిల్లర్‌గా పేర్కొనే అధిక రక్తపోటు కారణంగా సంభవిస్తున్న పక్షవాతం నిరోధమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సదుపాయాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

సాంఘిక బహిష్కరణపై కఠిన చర్యలు తీసుకోవాలి

నెహ్రూనగర్: దళితులపై వివక్ష, అంటరానితనం ఇంకా కొనసాగుతూనే ఉందని అందుకు నిదర్శనం పిఠాపురం నియోజకవర్గంలోని మల్లాం గ్రామ సాంఘిక బహిష్కరణ అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చందోలు శశికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాంఘిక బహిష్కరణకు ప్రధాన కారకులైన వారిపై అట్రాసిటీ చట్టం కింద వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

టెన్త్‌లో మెరిసిన పేద విద్యార్థులు

- టెన్త్‌లో 79.45 శాతం ఉత్తీర్ణత నమోదు
- 1,329 మంది విద్యార్థుల్లో 1,056 మంది ఉత్తీర్ణత
- 584, 582 మార్కులతో టాపర్లుగా నిలిచిన విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నగరపాలకసంస్థ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలతో పోటీ పడి అత్యుత్తమ ఫలితాలు సాధించారు. నగర పరిధిలోని 14 ఉన్నత పాఠశాలల నుంచి గత మార్చిలో నిర్వహించిన పరీక్షలకు హాజరైన 1,329 మంది విద్యార్థుల్లో 1,056 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 79.45 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఆయా పాఠశాలల్లో చదివిన నిరుపేద విద్యార్థులు 560కు పైబడి మార్కులు సాధించారు. కొత్తపేటలోని జలగం రామారావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలకు చెందిన చాంద్‌బాషా అత్యధికంగా 582 మార్కులు సాధించాడు. గుజ్జనగుండ్లలోని నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలకు చెందిన మరో విద్యార్థిని డి.శ్రీలక్ష్మి 581 మార్కులు సాధించింది. ఈ విధంగా పెద్ద సంఖ్యలో 550కు పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

పాఠశాలల వారీగా పరిశీలిస్తే...

వేణుగోపాల్‌నగర్‌లోని ఎస్‌కేబీపీఎం హైస్కూల్ 89 శాతం ఉత్తీర్ణతో ప్రథమ స్థానంలో నిలిచింది. అదే విధంగా ఎస్సీఎంపీ హైస్కూల్ 83 శాతం, శ్రీగొలుసు నాంచారమ్మ–కొండలరావు హైస్కూల్ 83 శాతం, భారత్‌పేట హైస్కూల్ 83 శాతం, జలగం రామారావు హైస్కూల్ 82 శాతం, కాసు శాయమ్మ హైస్కూల్ 80 శాతం, ఎస్‌కేబీఎం హైస్కూల్ 79 శాతం, పినపాటి ప్రభుదాస్ హైస్కూల్ 79 శాతం, ఎస్బీఎస్ఆర్ హైస్కూల్ 77 శాతం, పట్టాభిపురం హైస్కూల్ 74 శాతం, స్వర్ణాంధ్రనగర్ హైస్కూల్ 73 శాతం, ఎస్ఆర్ఆర్ హైస్కూల్–గుజ్జనగుండ్ల, కేఎస్సాఆర్టీ హైస్కూల్ 69 శాతం, కేఎస్సార్ మున్సిపల్ హైస్కూల్ 68 శాతం ఉత్తీర్ణత సాధించారు.



జలగం రామారావు హైస్కూల్లో 582 మార్కులు సాధించిన చాంద్‌బాషాకు స్వీట్ తినిపిస్తున్న హెచ్‌ఎం సుధారాణి



జలగం రామారావు హైస్కూల్లో విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఎస్‌కేబీపీఎంసీ హైస్కూల్ విద్యార్థులకు డీఈఓ అభినందన

టెన్త్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వేణుగోపాల్‌నగర్లోని ఎస్‌కేబీపీఎంసీ హైస్కూల్ విద్యార్థులను డీఈఓ సీవీ రేణుక అభినందించారు. 89 శాతం ఉత్తీర్ణతతో నగరంలోని ప్రథమ స్థానంలో నిలవడంపై విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను అభినందించారు. పదేళ్లుగా ప్రథమస్థానంలో ఉండటం గర్వకారణమన్నారు. పరీక్షలు రాసిన 139 మంది విద్యార్థుల్లో 124 మంది ఉత్తీర్ణులు కావడంతో పాటు సాహు చిన్మయి 577, భావజ్ఞ 576, బి.గోపి 567 మార్కులు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీవైఈఓ జి.ఏసురత్నం, పాఠశాల హెచ్‌ఎం జీవీ పద్మావతి, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు, ఉపాధ్యాయులు జె.విజయానంద్ పాల్గొన్నారు.

- కొత్తపేటలోని జలగం రామారావు హైస్కూల్లో 582 మార్కులు సాధించిన విద్యార్థి చాంద్‌బాషాను పాఠశాల హెచ్‌ఎం కట్టా సుధారాణి అభినందించారు. పాఠశాలలో 81.75 శాతం ఉత్తీర్ణతతో పాటు శ్రీహరి 568, జయప్రసూన 561 మార్కులు సాధించినట్లు ఆమె తెలిపారు.
- గుజ్జనగుండ్ల హైస్కూల్లో 581 మార్కులు సాధించిన విద్యార్థిని డి.శ్రీలక్ష్మిని పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని కష్టపడి చదివి, ఈస్థాయిలో మార్కులు సాధించడంపై ఉపాధ్యాయుడు సోమరౌతు రామకృష్ణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



గుజ్జనగుండ్ల హైస్కూల్లో 581 మార్కులు సాధించిన విద్యార్థిని శ్రీలక్ష్మిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గరల్స్ హైస్కూల్ విద్యార్థినుల ప్రతిభ

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ చూపారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఎండీ ఖాసిం తెలిపారు. విద్యార్థిని నాగసాయి రోషిణి 573 మార్కులు, 13 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించటంతోపాటు కొన్ని సబ్జెక్టుల్లో నూరు శాతం మార్కులు సాధించారని తెలిపారు. 80 శాతం మంది ఉర్దూ మీడియం విద్యార్థినుల్లో 92శాతం మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలో దశల వారీగా క్వాలిటి కంట్రోల్ సిబ్బంది, ఎమినిటీ సెక్రటరీలు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. పాత గుంటూరు, మారుతీ నగర్, బాలాజీ నగర్ ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ నిర్మాణాలలో నాణ్యతా లోపం గుర్తిస్తే తక్షణం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇప్పటికే వార్డు సచివాలయాల వారీగా అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, సదరు పనులను ప్రాధాన్య క్రమంలో చేపడతామని వివరించారు. ఆయా ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలని, డోర్ టూ డోర్ చెత్త సేకరణ నూరు శాతం జరగాలని ప్రజారోగ్యాధికారులను ఆదేశించారు. పర్యటనలో ఏఈ పి.వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

నగర పరిధిలోని అన్న క్యాంటీన్లను నోడల్ అధికారులు ప్రతి రోజు పరిశీలించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నల్లచెరువు అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ప్రజల సంఖ్యకు అనుగుణంగా ఇండెంట్ పెంచుకోవాలని, ఏ ఒక్కరికి ఆహారం అందలేదని ఫిర్యాదు రాకూడదని అక్షయ పాత్ర సిబ్బందికి సూచించారు.

టెన్త్ ఫలితాల్లో శ్రీచైతన్య ప్రభంజనం

గుంటూరు ఎడ్యుకేషన్: టెన్త్ ఫలితాల్లో శ్రీచైతన్య పాఠశాలల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని సంస్థ ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య తెలిపారు. నవభారత్‌నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పరీక్షలు రాసి 3,105 మంది విద్యార్థుల్లో 96 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. వారిలో ముగ్గురు విద్యార్థులు 597 మార్కులు సాధించగా, 595 కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు 13 మంది ఉన్నారని వివరించారు. 590కు పైగా సాధించిన వారు 88 మంది ఉన్నట్లు చెప్పారు. పొన్నూరుకు చెందిన పెడపాటి వెంకట నాగసాయి కృతిక, ఆలపాటి జ్యోతిర్మయి, సత్తెనల్లికి చెందిన దమ్మాటి లక్ష్మీసాత్విక 597 మార్కులు సాధించినట్లు తెలిపారు. అత్యుత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ జి. అప్పాజీ, హెచ్ సురేంద్ర, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం అంజయ్య

కలెక్టరేట్ వద్ద క్రైస్తవుల రిలే దీక్షలు

నెహ్రూనగర్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తు చేపట్టాలని సామాజిక వేత్త డాక్టర్ గోళ్లమూడి రాజ సుందరబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద క్రైస్తవ ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నేషనల్ దళిత్ క్రిస్టియన్ వాచ్ రాష్ట్ర అధ్యక్షురాలు గద్దె రత్నశ్రీ మాట్లాడుతూ శాంతియుతంగా న్యాయం జరిగే వరకూ ఈ దీక్షల కార్యక్రమం కొనసాగుతుందని, రోజుకొక పేట, గ్రామం,చర్చిలను సందర్శిస్తామన్నారు. కార్యక్రమంలో క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు మద్దు ప్రేమ జ్యోతి బాబు, క్రైస్తవ నాయకులు ఆరుమళ్ళ మార్కు, ఇద్వా వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు బడుగు విజయలక్ష్మి, భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం, సృష్టికర్త ప్రార్థన మందిరం పాస్టర్ రవిచంద్ర, ఇమ్మానియేల్ ప్రార్థన మందిరం పాస్టర్ భాగ్యరాజు, లూథరన్ చర్చి పాస్టర్ సంతోష రావు, ఇద్వా నాయకులు వేల్పూరి మరియరాణి, కోరబండి జోత్స్న పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న క్రైస్తవ సంఘాల నాయకులు

టెన్త్ ఫలితాల్లో కన్న స్కూల్ విద్యార్థుల ప్రతిభ



కె. మనశ్విని, 588



ఎస్పీ అమృత వర్ధన్, 584



డి.జ్ఞానేశ్వరి, 583



హెచ్. మనోజ్, 580

గుంటూరు ఎడ్యుకేషన్: టెన్త్ ఫలితాల్లో కన్న విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు తెలిపారు. కె.మనస్విని 588, ఎస్పీ అమృతవర్ధన్ 584, డి.జ్ఞానేశ్వరి 583, హెచ్.మనోజ్ 580 మార్కులతో మొత్తం 56 మంది విద్యార్థినీ, విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు.

ముందస్తు పన్ను చెల్లింపునకు 7 రోజులే గడువు

నెహ్రూనగర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025–26) సంబంధించిన ఆస్తి పన్నును ముందస్తుగా ఏప్రిల్ నెలాఖరులోగా ఏక మొత్తంగా చెల్లించే వారికి మొత్తం పన్నుపై 5 శాతం రాయితీ లభిస్తుందని, అదే విధంగా ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నుబకాయిలను ఒకేసారి ఏక మొత్తంగా చెల్లించే వారికి వడ్డీపై 50 శాతం రాయితీని కూడా ఈ నెలాఖరులోపు చెల్లించి పొందవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లించే వారికి వీలుగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో 8, సర్కిల్ కార్యాలయంలోని 6 ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు ప్రతి రోజు ఉదయం 7 నుండి రాత్రి 8 గంటల వరకు పని చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు.

మీరు చెప్పిందే జేఏసీ కోరుతోంది..

బెటర్ శంకర్ విలాస్ ఫ్లైఓవర్ సాధన సమితి

గుంటూరు ఎడ్యుకేషన్: శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జికి సంబంధించి జేఏసీ కొత్తగా ఏమీ కోరట్లేదని, గతంలో ప్రభుత్వం ప్రకటించిన డిజైన్ ప్రకారమే ఫ్లైఓవర్ నిర్మించాలని కోరుతున్నామని బెటర్ శంకర్ విలాస్ ఫ్లైఓవర్ సాధన సమితి నాయకులు కోరారు. బుధవారం అరండల్‌పేటలోని ఓ హోటల్లో మీడియా సమావేశంలో జేఏసీ నాయకులు ఎల్ఎస్ భారవి, పీవీ మల్లికార్జునరావు మాట్లాడుతూ గతంలో గల్లా జయదేవ్ ఎంపీగా ఉన్నప్పుడు, తాజాగా ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక కూడా ఐకానిక్ బ్రిడ్జి నిర్మిస్తామని, అండర్ బ్రిడ్జి కూడా ఉంటుందని ప్రకటించారన్నారు. కానీ తీరా డిజైన్ చూశాక యూటర్న్ తీసుకున్నారన్నారు. బ్రిడ్జి పొడవును 930 మీటర్లకు కుదించి, ఆర్‌యూబీ కూడా లేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట ప్రకటించిన ఒరిజినల్ డిజైన్ ప్రకారం హిందూ కాలేజి కూడలి నుంచి లాడ్జి సెంటర్ వరకూ ఐకానిక్ ఫ్లైఓవర్ నిర్మించాలని, ఆర్‌యూబీ నిర్మించాలని, సర్వీసు రోడ్లు కనీసం 30 అడుగుల వెడల్పుతో ఉండాలని జేఏసీ తరఫున కోరుతున్నట్లు చెప్పారు. సమావేశంలో అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, జేఏసీ నాయకులు వెంకట్రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భారవి

మలబార్ గోల్డ్‌లో అక్షయ తృతీయ ఆఫర్లు

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం మలబార్ గోల్డ్, డైమండ్స్ షోరూంలో అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా బుధవారం ఆఫర్లు ప్రకటంచారు. బంగారు ఆభరణాల తరుగు చార్జీలపై 25 శాతం వరకు తగ్గింపు, ప్రీసియస్ స్టోన్స్, అన్ కట్ డైమండ్స్ ఆభరణాల తరుగు చార్జీలపై ఫ్లాట్ 25 శాతం తగ్గింపు, వజ్రాల విలువపై 25 శాతం తగ్గింపు అందిస్తున్నట్లు స్టోర్ హెడ్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ గోపీకిరణ్ తెలిపారు. విలువైన వృత్తి నైపుణ్యం మేళవించిన ఆభరణాలలో వినియోగదారులు పెట్టుబడి పెట్టేందుకు ఈ పండుగ ఆఫర్లు అసాధారణమైన అవకాశాలను కల్పిస్తున్నాయని పేర్కొన్నారు.



ఆఫర్లు ప్రకటిస్తున్న హెడ్ నదీర్, గోపీకిరణ్